# 35. అప్ అండ్ డవున్

"మూడు సార్లొచ్చేరు మీరీ మధ్య హెడ్డాఫీసుకి" అని పలకరించాడు అతను.

"సారీ. మీరెవరో నేను గుర్తుపట్టలేదు."

"నా పేరు బాబూరావు. మన కంపెనీ హెడ్డాఫీసులో స్టోర్స్ సెక్షన్‌లో పనిచేస్తున్నాను."

"కంట్రోలర్ ఆఫ్ స్టోర్సులో బాబూరావు గారు మీరేనా? అయ్యో!" నెత్తి బాదుకున్నాడు ఆగంతకుడు.

"ఇందులో మీరు నెత్తి బాదుకోవలసిందేంటో అర్థంకాలేదు. " అన్నాడు బాబూరావు.

"అబ్బే, మరేం లేదు. నా మీద ఈ మాత్రం సానుభూతి వున్న మీలాంటి వాళ్ళు ఏ స్టోర్సులోనో కాక ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఉండకూడదా అని-"

"మీరు ఎస్టాబ్లిష్‌మెంట్ సూపరింట్ సింహాచలం గారి దగ్గిర కూర్చుని ఏదో చెప్పుకుంటూ వుండటం చూశాను. ఏదైనా ట్రాన్స్‌ఫర్ కోసమా, మీ ప్రయత్నం?"

'అవునండీ. మా ఆవిడ ఆరోగ్యం ఈ మధ్య బాగా దెబ్బతిన్నది. పూర్వ జన్మకృతం పాపం వ్యాధి రూపేణ పీడితా అన్నట్టుగా దొరికిపోయాం."

"ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్కు జగన్నాథం చెప్పాడు, మీరు రాజోలులో పనిచేస్తున్నారనీ, కాకినాడ గానీ రాజమండ్రి గానీ వెయ్యమని అడుగుతూ సింహాచలం గారి చుట్టూ తిరుగుతున్నారని!"

"సంసారం గుట్టూ రోగం రట్టూ అన్నారు. కాని నా విషయంలో అది తారుమారైంది. నా సంసారం సంగతి అందరికీ తెలిసిపోయింది గాని మా ఆవిడ రోగం సంగతి ఎవరూ అర్థం చేసుకోలేని గుట్టుగా వుండిపోయింది."

"సింహాచలం గారితో చెప్పుకోలేకపోయారా?"

"ఎందుకు చెప్పుకోలేదూ? పుట్టిన వాళ్ళు ముగ్గురూ మగపిల్లలై పోయారు, ఆడపిల్ల పుట్టనే లేదని మా ఆవిడకి మతిసరిగ్గా వుండటం లేదు.  కాకినాడలో అయితే వాళ్ళ అమ్మా, నాన్నా ఉన్నారు. రాజమండ్రిలో అయితే మా అమ్మా, నాన్నా వున్నారు. ఈ రెండూళ్ళలో ఎక్కడేసినా నా డ్యూటీ గొడవలో నేనుండిపోయినప్పుడు ఏ ప్రమాదం జరక్కుండా వాళ్ళు చూసుకుంటారని కూడా చెప్పేను.  ఎన్నిసార్లడిగినా వీలుపడ్డం లేదంటాడే గాని వ్యవహారం ఇదీ అని ఓ కొలిక్కిరాడు పోనీ ఏమైనా కతికేరకమా అంటే అగ్నిహోత్రం లాంటి వాడయ్యేను!"

"ఆ మాట నిజమే. మరి మిమ్మల్ని కాకినాడ వేస్తే మీ బదులు వాళ్ళ అల్లుణ్ణి రాజోలు వెయ్యాలి. పోనీ మిమ్మల్ని రాజమండ్రి వెయ్యాలంటే సాక్షాత్తూ వాళ్ల అబ్బాయినే రాజోలు పంపాలి. చూస్తూ చూస్తూ ఎలా రాస్తాడు అలాంటి ప్రపోజలు?"

"ఈ జన్మకింతే. మతిభ్రమలో మా ఆవిడ ఏ అఘాయిత్యమో చెయ్యడం, నేనూ నా పిల్లలూ దిక్కులేని వాళ్లు అవడం ఇదే రాసి పెట్టుంది గాబోలు నాకు!"

"పోనీ మీరొకసారి మన జనరల్ మేనేజర్ తిరుపతిరావు గార్ని కలవకూడదూ?"

"ఇంత చిన్న విషయానికి అంత పెద్దవార్ని ఎందుకు కలవాలి? ఒకవేళ ఆయనతో మొరెట్టుకుంటే ఆయన నా మీద జాలిపడి నాకు కాకినాడో రాజమండ్రో వేసినా అమ్మ పీనుగా, అని ఈయన నామీద కక్ష పెట్టుకోడా?"

"ఏమో! చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలని మీలాంటి పెద్దలే అంటారు మరి. నేను మీలాగ బ్రాంచి మేనేజర్ని కూడా కాదు, చిన్న వుద్యోగిని"

"దానికేం వుంది లెండి! ముఖే ముఖే సరస్వతి - అన్నారు. మీకు తోచిందేదో మీరు చెప్పేరు. ఇన్నిసార్లు ఇంతదూరం రానే వచ్చాను. ఆయన్ని కూడా కలిసే వెళ్తాను. చచ్చే వాడికి సముద్రం మోకాలిలోతుట. ఇంతకీ నా తిరుగు ప్రయాణం రేపు రాత్రికే. ఇవ్వాళ 'గౌతమి'కి టికెట్ దొరకలేదు! రేపు ఉదయం ఆయన్ని కలుస్తాను.!"

✣ ✣ ✣

"అమ్మయ్య. దొరికారు కదండి. మీకోసం అరగంట నుండి ప్లాట్‌ఫారం అంతా గాలిస్తున్నాను."

"మీరు-మీరు బాబూరావు గారు కదు? సారీ. చప్పున గుర్తురాలేదు. నిన్న కలిపేంగానీ, రాత్రి పొద్దప్పుడుకదా... ?"

"సర్లెండి. జి.ఎమ్. గార్ని మీరు ఉదయం కలిశారు గానీ ఆయన ఔనో కాదో ఒక మాట చెప్పేవరకయినా ఉండకుండా పారిపోయొచ్చారట! ఆయన ఒకటే చెప్పడం, నవ్వడం. ఇదుగో మీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్. డిశ్పాచ్ గుమస్తా పోస్టులో వేస్తానంటుంటే, కాదు, నేనిస్తానని చెప్పి తీస్కొచ్చాను. మీరు ఈ బండి కెళ్తానని చెప్పారుగా!"

"ఏమిటీ! ట్రాన్స్‌ఫర్ ఆర్డరే? నాకే? జి.ఎమ్ గారు నామీద దయతల్చేరా? థాంక్యూ సార్! థాంక్యూ, బాబూరావు గారు! ఇంతకీ రాజమండ్రేశారా కాకినాడా?"

"ఇక్కడా కా దక్కడా కాదు. రాజానగరం వేశారు. మీరు మీ ఫామిలీని రాజమండ్రిలో నన్నా వుంచొచ్చు. కాకినాడ్లోనైనా వుంచొచ్చు. డ్యూటీ మాత్రం అప్ అండ్ డౌన్ చేస్తారు."

"ఓ! రాజానగరం రెంటికీ సెంటరే. పర్వాలేదు. ఎలాగో అవస్త పడతాను."

"ఎటొచ్చీ రాజానగరంలో ప్రస్తుతం ట్రయినింగ్ అవుతున్న మురళి అనే అబ్బాయిని మాత్రం ప్రస్తుతం ఉన్న బ్రాంచ్ మేనేజర్ రమణయ్య గారి లాగా అల్లరిపెట్టకూడదు. అతన్ని తీర్చిదిద్ది ఏడాదిలోగా కన్‌ఫర్మ్ చేయించాలన్న సంగతి గుర్తెట్టుకోవాలి."

"అదేమిటి, ఆ కండిషను?"

"కండిషను కాదు, ఏర్పాటు. అంతే."

"అదే, ఎందుకట?"

"మురళి ఎవరో కాదు, జి.ఎమ్. తిరుపతిరావు గారికి కాబోయే అల్లుడు! అందుకు!! అతని మంచికోసమే ఈ ఆర్డరు!"

"అహా! ఎంతైనా తిరుపతి తిరుపతే: సింహాచలం సింహాచలమే కదండి!" ☼

*("ఆంధ్రభూమి" డెయిలీ : 22.1.92)*